

# మేనక వేదాంతం

"గోపాల చక్రవర్తి"

వెల్లి విరిసిన వెన్నెల, రాధికాదేవి తెల్లచీరవలె బొండుమల్లియ పూలవలె వెల్తురు వానవలె, ధాత్రినంతా ఆక్రమించుకొన్న రేయి. ఒంటిగంట అయిందేమో! మనుష్యుల్నీ, మహాపట్టణాన్నీ విడిచి మానసాన్ని ఏదో మహత్తర నిశ్శబ్దం మ్రింగివేయగా మాలతినీ, మాధవినీ తలుచుకుంటూ మత్తుగా నడుస్తున్నాను. మస్తిష్కపు మారుమూలల్లో సుమధుర ప్రాచీనస్మృతులు వేడిగా పాటలు పాడుతున్నాయి.

ప్రశాంత వాతావరణం, మిలమిలా పరిగెత్తే ఏటినీరూ, ఊహాలోకపు సుఖజీవితాన్ని రంగుల్లో చూపిస్తున్నాయి. రంగుల అతివాస్తవికపు టర్థాల్ని విడమర్చి చెప్పేందుకు నాకు శక్తిలేదు.

...నడుస్తున్నాను.

"చూడు వెన్నెలెంత ప్రశాంతంగా వుందో. ప్రపంచ కల్మషాన్నీ పాపాల్ని తుడిచిపెట్టడానికి వొచ్చింది" అన్నాడు, వెనకటికి కవి మిత్రుడు. ఈ చెట్లూ, వెన్నెలా, అమ్మాయిలూ, లేళ్లూ, జలపాతాలూ లేకపోతే ఎంత ఘోరం, ఎంత ఘోరం. అందంతో, దివ్యానుభూతులతో సుఖపడవచ్చు, తృప్తిపడవచ్చు- వేదకాలపు ఋషుల నాయ్గు భక్షణంవలె.

తల పైకెత్తి చూశాను. రెండు కొబ్బరిచెట్ల మధ్యనుంచి నింగి దొరసానిపీపువలె గోచరిస్తున్నది. దూరంగా ఎవరో ఇసుకలో పడుకొని చంద్రుణ్ణి చూస్తున్నారు. 'చందురుని చాతకము వలచేనా'—

నడుస్తున్నాను. అర్థంకాని జీవిత సమస్యల గూర్చి ఈ సమయంలో ఆలోచించకూడదు. అవన్నీ లోకాంతర గాథలు. "దూరపు మానిసి" లేచాడు. పరికించి చూశాను. పరిచయమైన ముఖం మల్లే గోచరించింది. మానసికాకాశంలో మబ్బులు లేవు.

ఎవరది, చక్రపాణి కాదుకదా.

ఆహా! నే ననుకున్నది నిజం. నా రసజగత్తుకు చక్రవర్తి చక్రపాణి. నా ప్రతి మాటకూ పుష్టినిచ్చి ప్రాణంపోసిన చక్రపాణి.

'ఇక్కడికెట్లా వచ్చావు'

'ప్రపంచ భ్రమణంలో శాంతికోసం పరిశోధించాను. ఎచ్చటా గోచరించలేదు. నేడీ రమ్య బృందావనానికి వచ్చాను"

'ఎంతకాలానికి, ఎన్నేళ్లకు మళ్లీ! నీ శ్రావ్యమైన గొంతుక!'

ఒక్కసారిగా మనోవల్మీకంలోని జ్ఞాపక సర్పాలు పడగలన్నీ విప్పి బుసలుకొట్టాయి. యుగయుగాల తమము అస్థిపంజరాన్ని విడిచిపెట్టింది. పాత కథలన్నీ (చుట్టూ పాడువడ్డ గోడలు లేవుగాని!) మళ్లీ వికసించాయి.


నిజానికి నేనే ఖర్మంకాలి నా జీవిత చరిత్ర ప్రకటిస్తే ఆరోజులనుగూర్చి తీవ్రంగా, దీర్ఘంగా వ్రాసేవాణ్ణి. ఊహా త్రివర్ణ చిత్రాలు యథార్థానికి వర్ణరహితంగా వుండొచ్చు. ఆ దినాల్లో ఎన్ని ఆశయాలు? అప్పటి జీవితానికీ, మోయలేని బరువులతో ఈడ్చే ఈ జీవితానికీ ఎంత వ్యత్యాసం!

"ఎంత వెదికినా కాన్పింపదు మేనక" అన్నాడు చక్రపాణి. ప్రక్కన నేను లేనట్టుగా భావించాడేమో.

"ఎవరోయి మేనక"

"సాధారణమైన అమ్మాయి" అన్నాడు చక్రపాణి.

"ఆస్కార్ వైల్డు" అనంతంలో మెదిలి "ఎ వుమన్ ఆఫ్ నో ఇంపార్టెన్స్" అన్నాడు.



"మూడో సంవత్సరంలో మేనక కళాశాలలో చేరింది...సన్నగా,
నాజూకుగా, యక్షకన్యవలె."

"సమాజ పురోగతికి సాధారణ వనితలే పునాది రాళ్లు"- వేదాంతి నాలో పలికాడు:

వెన్నెల మరీ ఎక్కువైంది. రాధికాదేవి వలపు వలె. సుమకన్నియల శరీర వాసనల్ని సావధానంగా ఆఘ్రాణిస్తున్న నన్ను "అట్లా కూర్చుందామా" అన్నాడు చిన్ననాటి మిత్రుడు.

నాకు నిద్రవస్తున్నది. ఒడలువిరిచి ధూమాంతో హోమాన్ని కానిస్తూ మంచుపొగల పొలాలవైపు చూస్తూ, చిక్కని నీలినీడలమధ్య ఇద్దరమూ కూర్చున్నాం. ఆకుల్నీ, కొమ్మల్నీ, వాటిని తాకే చంద్రకిరణాల్నీ చూస్తూ చక్రపాణి రాగాలాపన చేసి నా నరాల్ని నమలివైచాడు.

"చూశావా, మనమిద్దరమూ ఒక గదిలో వుంటూ వుండేవాళ్లమూ. నువ్వు వెళ్లిపోయిన తరువాత గూడా నేను అక్కడేవుంటూ చదువుకుంటున్నాను. రెండు సంవత్సరాలు గడిపాను ఆ గదిలో. కాబట్టి దాన్ని విడిచిపెట్టడానికి మనస్కరించలేదు.

మూడో సంవత్సరంలో మేనక కళాశాలలో చేరింది. సన్నగా, నాజూకుగా, యక్షకన్యవలె. పాఠాలులేని తొలిరోజుల్లో విలాసంగా, విహారాలు చేసేవాళ్లం. రోజూ ఆమెను చూసేవాణ్ణి. ఆమె కూడా చూసే దనుకుంటాను నన్ను.

గదికి మరలుతున్నా ఒక సాయంకాలం. ఆకసం నిండా మేఘాలు. వ్రేలాడే కారునల్లని ఏనుగుల వలె. దేవవేశ్య ఊర్వశి శిరోజాలవలె.

క్రమంగా, క్రమంగా వాయుదేవుడూ, వరుణ దేవుడూ సరసాలాడుకోవటం ఆరంభించారు. బాటకిరువైపులా నిల్చి వున్న వృక్షమూర్తులు పాంథులను చూసి నవ్వుతున్నాయి.

ఆశ్చర్యం!

మేనక నా వెనకనే వస్తున్నది. గువ్వపిట్టవలె ముడుచుకొని వస్తున్న ఆమెను చూసి స్మితంచేశాను, అనుకోకుండా. చిర్నగవుతో "పూర్తిగా తడిసిపోయాను" అన్నది తోయజాక్షి.

బెథోవిన్ నా నరాల్ని మీటుతున్నాడు. శూర్పణఖ ఒంటికాలి ఆంగ్లనృత్యంలా నా గుండె పాటలు పాడింది. నిశ్శబ్దపు హృదయగోళంలో సెందురుని చూసిన గభీర సాగర కల్లోలాన్ని విన్నాను.

"ఇంటికి పోదాం రండి" అన్న మేనకాదేవిని వెంబడించాను. కొన్ని సందుల పద్మవ్యూహాలను దాటి ఒక "నార్మన్ కేసిల్" చేరుకున్నాం. వర్షంలో తడిసిన ఒక నగ్నమూర్తి ఆయిల్లు.

"ఇట్లా కూచో రామూ" అని నన్ను కూచోపెట్టి లోపలికి వెళ్లింది. మండోదరీ రావణుల (రాక్షస) ప్రణయంనుండి భరతాచార్యు డెవరో శిష్యులకు పాఠం చెపుతున్న సన్నివేశమైన వస్తువు దాకా గోడలనిండా చిత్రాలున్నాయి. ఒకమూల ఎన్నో పుస్తకాలు ముచ్చటగా సింగారించుకొని కూర్చున్నవి. దగ్గరకు వెళ్లాను. తొలి పుట తీయడం తోటే మేనకకు—అని వ్రాయబడి వున్నది.

మెరుపు కన్నియల నృత్యం విపరీతంగా వున్నది బయట. మౌనంగా యథాస్థానంలో కూర్చున్నాను.

మూర్ఛపోయినంత పని అయింది. పాలసముద్రపు నురు కెరటాలవలె, ధవళమైన మడతల చీరతో, లవంగరు గులాబీరేకులతో, నక్షత్ర మండలానుండి ఒక జవ్వని దిగి వచ్చింది. పూలనిండా విరిసిన పూలతో ఇంద్ర ధనుస్సులా వంగిన మేనకను గాఢంగానే రసజీవితంలోని రమ్యత నాకు గోచరించింది.

'ఎవరమ్మా నీవు? ఈ గదిలోకి ఎందుకు వచ్చావు'

'ఒక అమ్మాయి తీసికొని వచ్చింది'

'అమ్మాయిలు రమ్మంటే వెళ్లిపోతావా వాళ్లతో. అసామాన్యుడి వింతకి' అన్నది మేనకాదేవి.

ఇద్దరం నవ్వుకున్నాం. చక్కని పాపికొండలూ, గోదావరీ ఎదురుగుండా వున్న చిత్రంలో కానిపించాయి.

ఆ మూడు సంవత్సరాలూ అట్లాగే గడిచి పోయాయి. చిత్రంగా చిత్రాలను చూపిస్తూ నా చేత చిత్రకవిత్వం చెప్పించింది. తాను చెప్పింది.

మా యిద్దరిలో లోలోపల లోతుగా వున్న సాహిత్యశక్తి యిద్దరినీ ఒకటిగాచేసి సారస్వత గానం చేయించింది.

నీవులేని కొరత తీర్చింది గోపీ! మనుష్యులకూ, మనీషులకూ దూరంగాతిరిగే నన్నుకదిపి ఇది చీకటి, ఇది వెలుతురు. ఇది అబద్ధం, ఇది నిబద్ధం అని చెప్పింది మేనకాదేవి.

స్మృతి రాలని శైశవంలో నా సూక్ష్మమూర్తి మూరతీరాలకు పయనించింది. అప్పటినించీ ఆడ

రించి ప్రేమతో చూసే స్త్రీమూర్తి కరవయింది నాకు. కాని మేనకమాటలు, జోలపాటలు నాకు వెన్నెల మూటలు. అప్పటి నా ప్రపంచానికి పరిధి లేదు.

ఇంతకూ మేనక ఏమయిందని నీ సందేహం. ఎవరో ఒక ఎనుబోతుల రాణుదాసుని కోరి పెళ్ళి చేసుకుంది. వెళ్లిపోతూ మేనకాదేవి పల్కిన వాక్యాలివి.

"చూడు, రామూ- సుందరమైన వస్తువులకూ, ఆర్టిస్టులకూ దూరంగా వుండాలి. జీవితాన్ని ఊహించేవాని కది సుఖం, అనుభవించినవానికి దుఃఖం సుమీ! చిరకాలం వుపయోగిస్తే వస్తువు మీద అభిమానం నశిస్తుంది. సుప్రసన్నతా రోచిస్సు లెల్లవేళలా తాండవంసేయు నీ వదనాన్ని ఎట్లా మర్చిపోతాను? నా గుండెల్లో హోరుమని, ఘోరు మని నువ్వు కురిపించిన ముత్యాలవానను ఎట్లా మర్చిపోతాను. కాని వెళ్లిపోవాలి రామూ. అశాంతీ, ఆకలీ, కరువూ, కాటకంతో నిండిన ప్రపంచంలోకి వెళ్లాలి."

శ్వేతద్వీపపు ఏకరాణి ఆమె నవ్వుతూ నిష్క్రమించింది. జలపాతాల మీద చంద్రకన్యల నాట్యదరహాసంతో ఆమె నిష్క్రమించింది. ఇట్లా నేనుమాత్రం సెలయేళ్లతో, చెట్లతో నవ్వుకుంటూ, తెలియనిబాధలో పాడుకుంటూ సంచరిస్తున్నాను."

చక్రపాణి ఆగిపోయాడు. మొహంలో అస్పష్టపు విచారరేఖలు చూశాను.

నిశ్శబ్దంపరచుకొన్న రాత్రి. తియ్యని చంద్ర కిరణాలు మరీ తెల్లనైపోతున్నాయి. ఆ విశాల సైకతాల్లో తొలిజీవితపు నిషా గురించి చక్రపాణి చెప్పిన మాటలనీ, మేనకాదేవినీ టెక్నికలర్‌లో ఊహిస్తూ, మరోసిగరెట్టు మైకంతో వెలిగించానేమో.

# ఆంద్రీ జడనోవ్: ఒక సింహావలోకనం

సోవియట్ రష్యా అగ్రనాయకుల్లో ఆంద్రీ జడనోవ్ ఒకడు. స్టాలిన్ తరవాత రష్యా నాయకత్వం ఎవరికి వస్తుంది?- అనే ప్రశ్న వచ్చినప్పుడల్లా, ప్రతివారికీ జడనోవ్ పేరు తప్పకుండా స్ఫురించేది. అతడి మరణానికి సంతాపం తెలుపుతూ సోవియట్ దేశమూ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఒక అమూల్యమైన నాయకుణ్ణి కోల్పోయామని రష్యా ప్రభుత్వం యిటీవల అంది.

జడనోవ్ ఇంత అపారమైన పలుకుబడీ, అధికారం దేశంలో ఎలా సంపాదించగలిగాడు? అతడి జీవితం గురించి చదువుతుంటే, ఆ ప్రశ్న సహజంగా వస్తుంది. ప్రభుత్వంలో మంత్రిగా పని చెయ్యలేదు; ఇదితరమైన ఏ ఉన్నత రాజకీయోద్యోగమూ చెయ్యలేదు. పెద్ద పరిశ్రమల్ని నిర్మించిన వాళ్లలో ఒకడు కాడు. మొన్న మొన్నటి దాకా, మరుగునే ఉంటూ వచ్చాడు. అయినా మొన్న అతడు చనిపోయినప్పుడు సోవియట్ అధికారులు చేసిన ప్రకటన గమనిస్తే, జడనోవ్ ప్రాముఖ్యం తెలుస్తుంది.

కమ్యూనిస్టుపార్టీ ఆమోదం లేకుండా సోవియట్ రష్యాలో ఏ పనీ జరగదు. స్వదేశంలోనే కాక, కమ్యూనిస్టు పరిపాలనలో ఉన్న అన్ని దేశాలమీదా ఆ పార్టీ ప్రాబల్యం ఉంది. అటువంటి పార్టీకి రాజ్యాంగశాఖ అయిన పొలిట్ బ్యూరోకి జడనోవ్ అగ్రనాయకుడు. అంచేతనే నిజమైన అధికారం చేతిలో ఉన్నవాళ్లల్లో ముఖ్యుడయాడు. పరిపాలన దినదిన వ్యవహారాలతో సంబంధం పెట్టుకోకుండా, ఇంకా ఉన్నత విషయాలపై దృష్టి కేంద్రీకరించాడు. మార్షల్ స్టాలిన్ పర్యవేక్షణక్రింద-ప్రభుత్వ ఆదర్శాలు నిర్దేశించడంలోనూ, మార్క్సిస్టు సూత్రాలు ఆచరణలో పెట్టే మార్గాలు అన్వేషించడంలోనూ కృషిచేశాడు. అందుకే ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నాడు.